
# సత్యవాక్యము

THE WORD OF TRUTH



# ఏకైక సదవకాశము

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా, లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొందుచున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 15 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్య మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 20/- లు మాత్రము పోస్టేజి ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
**P.O. Box 80, Sambamurthi St.,**
**KAKINADA - 533 004.**

గమనిక :- మీరు **M.O.** పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్య నంబరును మాకు తెలియ జేయండి. ఇది అత్యవసరం!!

**Razan Electric Press, Kakinada.**

# సత్యవాక్యం

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone : 0884-73722

Editor : J.C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 13 — జూలై 1993 — సంచిక 12


## సంపాదకీయము

### దేవునికి బాధ్యులెవరు?

### ( Who is accountable to God?)

ఈ లోకంలో మనం అనేక మందికి బాధ్యులము. మన తలిదండ్రులకు, యజమానులకు, దేశ చట్టానికి, ప్రభుత్వానికి బాధ్యులం. అన్నిటికంటె ముఖ్యంగా మనం దేవునికి బాధ్యులం. మన ప్రవర్తనకు, మాటలకు, ఋణాలకు, పన్ను చెల్లించుటకు మొదలగువాటికి ఈ లోకంలో మనం బాధ్యులం. మన భౌతిక ఆత్మీయ జీవితానికి దేవునికి బాధ్యులం. "గనుక మనలో ప్రతివాడు తన్ను గురించి దేవునికి లెక్క యొప్పగింపవలెను" అని అపో. పౌలు చెప్పాడు (రోమా 14 : 12). ఇంకో మాటలో మనం జరిగించిన క్రియల చొప్పున అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే దేహముతో జరిగించిన వాటి ఫలమును పొందునట్లు మనందరం క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షమవుతాము (2 కొరింథీ 5 : 10).

అందరు దేవునికి బాధ్యులే అన్నప్పుడు ఈ అందరిలో ఉన్న వారెవరు? ఈ లోక సంబంధంగా చూస్తే చిన్నపిల్లలు పన్నుకట్టే బాధ్యత లేనివారని మనమెరుగుదుము. పెద్దలకున్న పలురకాల బాధ్యతలు వారికుండవు. చిన్నపిల్లలు చేసిన నేరాలకు కూడ పెద్దల కియ్యబడే శిక్ష వారికియ్యబడదు. సర్వసాధారణంగా పసివారికి మరణ శిక్ష విధించబడదు.

మత సంబంధ విషయానికొస్తే, ఆదాముయొక్క పాపమును పసివారు వారసత్వంగా పొందుతారు, ఆదాముయొక్క పాపానికి నేటి పసిపిల్లలు బాధ్యులే యని అనేక మతశాఖలవారు బోధించుచున్నను, బైబిలు మాత్రం అట్టిదేదీ బోధించుటలేదు. ఒకని ఆస్థినిగాని, కొన్ని రోగాలనుగాని వారసత్వంగా పొందేలాగున పాపాన్ని మనం వారసత్వంగా పొందము. లేఖనము ఇట్లు చెప్పుచున్నది: "పాపము చేయువాడే మరణము నొందును. తండ్రియొక్క దోష శిక్షను కుమారుడు మోయుటలేదని, కుమారుని దోష శిక్షను తండ్రి మోయడు. నీతిపరుని నీతి ఆనీతిపరునికే చెందును. దుష్టుని దుష్టత్వము ఆ దుష్టునికే చెందును" (యెహెజ్కేలు 18:20). ఇంకో మాటలో ఎవని పనికి వాడే బాధ్యుడు.

అయితే ఆదాము పాపముసంగతి యేమిటి? ఆదాము హవ్వలు చేసిన పాపానికి దేవుడు వారినే బాధ్యులుగా ఎంచాడు. నాటినుండి నేటి వరకు ప్రతివాని విషయంలోను యిది సత్యం. యితరుల పాపాల నటుంచి, మనం చేసిన పాపాల బాధ్యతే మనం భరించలేకున్నాము. ఆదాము పాపము వలన మరణం ఈ లోకంలో ప్రవేశించింది. మానవాళి కంతటికి మరణం సంప్రాప్తమయ్యింది. అయితే ఎవడు పాపము చేయునో వానికే ఆత్మీయ మరణం ప్రాప్తిస్తాది.

అయితే అందరు పాపముచేసి దేవుడనుగ్రహించు మహిమను

పొందలేక పోవుచున్నారని పౌలు చెప్పలేదా? (రోమా 3 : 23) అవును గాని నీవు దాని సందర్భానుసారంగా చదివితే అబద్ధములాడు వారు, రక్తాన్ని చిందించువారు పాపులని అతడు చెప్పాడు. అంటే అతడు పెద్దవారినిగూర్చి, మంచిచెడ్డల నెరిగిన వారినిగూర్చి అతడు చెప్పుచున్నాడని గ్రహించగలవు. అట్టివారే పాపులుగాని, మంచి చెడుగుల నెరుగని పసికందులు కాదు.

ఎవరయితే వాక్యమును వినగలరో, విశ్వసించగలరో, ప్రభువును నమ్ముకొనగలరో, మారుమనస్సు పొందగలరో, ప్రభువు నామమును ఒప్పుకొనగలరో, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందగలరో అట్టి వయస్సుగలవారు దేవుని వాక్యప్రకారం దేవునికి బాధ్యులు (రోమా 10:17; హెబ్రీ 11:6; అపో.కా. 17:30; మత్త 10:32; మార్కు 16:16). ఈ పనులు చేయడానికి వయసు లేనివారు దేవుని దృష్టిలో పవిత్రులు, పాపము లేనివారు. వారినిగూర్చి యేసు మత్తయి 18 : 1-5లో చెప్పారు. పరలోకంలో ప్రవేశించాలంటే మనం వారివలె కావాలని ఆయన చెప్పారు.

అయితే చిన్నపిల్లలు కూడ ఒక్కొక్కసారి చాల చెడ్డపనులు చేయరా? అవును నిజమే. అయితే అనేక సందర్భాల్లో వారు పెద్దవారిని అనుకరించి అట్టి పనులు చేస్తారు. సాధారణంగా ఏ కోర్టు వారికి శిక్ష విధించదు. ప్రభువు కూడ పసిపిల్లలను శిక్షించరు.

తరువాత అపొస్తలుల కార్యములలో యింటివారందరు బాప్తిస్మముపొందిన సందర్భాలు కొన్ని కనబడతాయి. కొర్నేలి ఇంటివారు, లూదియ ఇంటివారు, ఫిలిప్పీ చెరసాల అధిపతి యింటివారు మార్పుజెందుటను గూర్చి మనం చదువుతాం. ఆగృహాల్లో తప్పక పసిపిల్లలుండి యుంటారు. పెద్దవారితో సహా పసిపిల్లలుకూడ పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొంది యుందురుగదా అని మనం

ఆలోచించవచ్చును. ఆ గృహాల్లో చిన్న పిల్లలు ఉండియుండవచ్చు, ఉండియుండకపోవచ్చు. అయితే ఆ యింటివారందరు సువార్తకు లోబడిరి యని దైవవేదము చెప్పుచున్నప్పుడు, వారు విధేయత చూపుటకు వయసు వచ్చిన వారని తప్పక గ్రహింపగును. పసిపిల్లల కొరకు వేరొకరు విధేయత చూపనవుసరం లేదు.

ఇంతకీ దేవునికి బాధ్యులెవరు? అన్నప్పుడు మంచిచెడ్డల నెరిగిన వారు, దేవుని చిత్తాన్ని గ్రహించవయసుగలవారు, తాము పాపులమని ఎరిగినవారు రక్షింపబడుటకు విధేయత చూపుచున్నామని తెలిసికొని ప్రవర్తించువారని జవాబీయవలసి వచ్చును. నీవు దేవునికి బాధ్యుడవా? నీవు ఈ వ్యాసాన్ని చదివి, గ్రహించుకొనినయెడల, నీవింకా ప్రభువునకు లోబడని యెడల నీవు బాధ్యుడవే. గనుక నీవు ఆయనకు లోబడవలసియున్నది. ఈ విషయంలో నీవు జాప్యం చేయవనే మా విశ్వాసము.

---

## క్రీస్తునిగూర్చి మీకేమి తోచుచున్నది!
## ( What Think Ye of Christ? )

యేసుక్రీస్తు ఈ లోకమందు ఉద్భవించినది మొదలుకొని ఆయన యెవరు? అనే ప్రశ్నను ప్రతివారు ఎదుర్కొనవలసి వచ్చుచున్నది. ఈ లోకమందు సంచరించిన అనేక మతగురువులవలె గాక యేసు యొక్క నామము ప్రతివానిలోను వివిధ భావములను రేకెత్తించుచున్నది. ఇది చాల ప్రాముఖ్యమైన ప్రశ్న, విశ్వాసమునకది మూలరాయి వంటిది (యెష. 28 : 16). మానవుడు క్రీస్తుని గూర్చి ఏమి తలంచుచున్నాడో దానిని బట్టి అతని ఆత్మయొక్క గమ్యస్థితి యుండును. అందుకే "నేను ఆయననని (అనగా దేవుని కుమారుడనని) మీరు విశ్వసించనియెడల మీరు మీ పాపములలోనే యుండి చని పోవుదురని" యేసు చెప్పెను (యోహాను 8:24).

"ఒకప్పుడు పరిసయ్యులు కూడియుండగా యేసు వారిని చూచి క్రీస్తును గూర్చి మీకేమి తోచుచున్నది? ఆయన ఎవని కుమారుడని అడిగెను. వారు-ఆయన దావీదు కుమారుడని చెప్పిరి" (మత్తయి 22:41, 42). శరీరమును బట్టి యేసుక్రీస్తు దావీదు కుమారుడయ్యెను (రోమా 1:7). ఆయన తల్లియైన మరియ మనుష్య మాత్రురాలు గనుక ఆయన మనుష్యకుమారుడాయెను. క్రీస్తు శరీరధారియై మన మధ్య నివసించెను (యోహాను 1:14). ఆయన దైవమానవత్వములను కలిగి యుండుటవలన మానవుల రక్షకునిగాను, దేవుని సన్నిధానమున వారికి మధ్యవర్తిగాను ఉండుటకు అవకాశ మేర్పడెను (1 తిమో 2:5, 6). మనుష్య కుమారుని వలె క్రీస్తు శోధింపబడెను. ఆకలి దప్పికల ననుభవించెను, శ్రమలను, బాధలను భరించెను. మానవులందరివలె ప్రార్థనావశ్యకతను కలిగియుండెను. అయితే ఆయన కేవలము మానవమాత్రుడు కాడు.

## దేవుని అద్వితీయ కుమారుడు

యేసుక్రీస్తు దేవుని అద్వితీయ కుమారుడై యుండెను. యేసు దావీదు కుమారుడని పరిసయ్యులు చెప్పినది సత్యమే గాని, అది పరిపూర్ణ సత్యము కాదు. క్రీస్తు కేవలము మానవుడే అయితే దావీదు ఆయనను ప్రభువని ఏల సంబోధించెనని యేసు వారి నడిగెను. క్రీస్తు దావీదునకు ముందునుండియే యుండెను. నిజానికి ఆయన లేని సమయమంటు ఎన్నడు లేనేలేదు (యోహాను 1:1, 8:58). ఆయన అల్ఫాయు, ఓమేగయు, ఆదియు అంతమునై యున్నాడు (ప్రకటన 1:8). కాలారంభము కాకముందునుండియే క్రీస్తు ఉండెను. కాలాంతమయిపోయినను కూడ ఆయన ఉండును.

క్రీస్తు దేవునియొక్క ఏకైక కుమారుడు. పరిశుద్ధాత్మని శక్తి వలన ఆయన ఒక కన్యకు జన్మించెను. ఆయన తండ్రి దేవుడు గనుక

ఆయన దైవత్వము కలిగి దేవుని కుమారుడై యుండెను. ఆయన ఇమ్మానుయేలని పిలువబడెను. ఇమ్మానుయేలనగా దేవుడు మనకు తోడని యర్థము (మత్తయి 1:23). ఆయన శరీరధారియైన దేవుడు: "నిరాక్షేపముగా దైవభక్తిని గూర్చిన మర్మము గొప్పదై యున్నది; ఆయన సశరీరుడుగా ప్రత్యక్షుడయ్యెను. ఆత్మ విషయమున నీతిపరుడని తీర్పు నొందెను. దేవదూతలకు కనబడెను, రక్షకుడని జనములలో ప్రకటింపబడెను, లోకమందు నమ్మబడెను. ఆరోహణుడై తేజోమయుడయ్యెను" (1 తిమో 3:16). అందువలననే యేసు "నన్ను చూచినవాడు తండ్రిని చూచియున్నాడని" చెప్పగలిగెను (యోహాను 14:9). ఆయన దేవుని మహిమయొక్క తేజస్సును, ఆయన తత్వముయొక్క మూర్తిమంతమునై యుండెను (హెబ్రీ 1:3).

## అనేకుల సాక్ష్యములు

యేసు దేవుని కుమారుడని సాక్ష్యము పొందెను. యేసు యోర్దాను నదిలో యోహానుచేత బాప్తిస్మము పొందగా ఇదిగో ఈయన నా ప్రియకుమారుడని తండ్రియైన దేవుడు ఆకాశమునుండి సాక్ష్యమిచ్చెను (మత్తయి 3:16, 17). మరల యేసు ఒక కొండమీద రూపాంతరము పొందగా అదే సాక్ష్యపు పలుకులను దేవుడు ఆయనను గూర్చి మరల పలికెను (మత్తయి 17:1-5). యేసుయొక్క శిష్యులు కూడ ఆయన నిజముగా దేవుని కుమారుడని చెప్పి ఆయనకు మ్రొక్కిరి (మత్తయి 14 : 34). దయ్యములు పట్టిన మనుష్యులుకూడ యేసు దేవుని కుమారుడని సాక్ష్యమిచ్చిరి (మత్తయి 8:29). ఆయన దేవుని కుమారుడని చివరకు అపవాదికూడ ఒప్పుకొనెను (మత్తయి 4 : 3). అంతేకాదు యేసును సిలువవేసిన సైనికులు సహా "నిజముగా ఈయన దేవుని కుమారుడని చెప్పుకొనిరి" (మత్తయి 27:54).

క్రీస్తు దేవుని కుమారుడనని తననుగూర్చి తాను చెప్పుకొనెను

(మత్తయి 27:48). నేటి వేదాంతులు ఆయన ఒక సత్పురుషుడేగాని దేవుని అద్వితీయ కుమారుడు కాడని చెప్పుదురు. సత్పురుషులు అబద్ధమాడజాలరు. ఆయన దేవుని కుమారుడు కానియెడల సత్పురుషుడెట్లు కాగలడు? ఆయనను గూర్చి నీకేమి తోచుచున్నది? ఆయన దేవుని కుమారుడని దైవవేదము ఘోషించుచున్నది. అయితే నీ యభిప్రాయ మేమిటి? ఆయన యెవరి కుమారుడు?

## మిన్నయైన బోధకుడు

యేసు చేసిన బోధలు ఆయన దేవుని కుమారుడని సాక్ష్యమిచ్చుచున్నవి. ఆయన ప్రజలకు బోధించినప్పుడు వారి శాస్త్రులవలె గాక అధికారముగల వానివలె వారికి బోధించెను (మత్తయి 7:29). ఆయనలో సహజముగాయున్న అధికారమును బట్టి మానవులకంటె ఉన్నతునిగా ఆయన అగుపడెను. ఆయన భవిష్యత్తును సంపూర్ణముగ ఎరిగినవానివలె ఖచ్చితముగా బోధించెను. మనుష్యుల అంతరంగిక స్వభావమును ఆయన ఎరిగియుండెను. అందువలన ఆయన మానవులకంటె మిన్నయైనవాడని నిరూపించుకొనెను. యేసు అందరిని ఎరిగినవాడు. ఆయన మనుష్యుని అంతర్యమును ఎరిగినవాడు. గనుక ఎవడును మనుష్యునిగూర్చి ఆయనకు సాక్ష్యమియ్య నక్కరలేదు అని యోహాను 2:24, 25లో వ్రాయబడియున్నది.

యేసు చేసినబోధ అంతయు సంపూర్ణమైనది, శ్రేష్ఠమైనది. ఆయన బోధలను వేదాంతులు, విగ్రహారాధికులు, దేశనాయకులు, యూదులు, క్రైస్తవులు మొదలగు వారనేక రీతులుగ పరిశోధించుచునే యున్నారు. అయితే నేటివరకు ఏ మానవుడు కూడ ఆయన బోధలో దోషమున్నట్లు చెప్పలేకపోవుచున్నాడు. అందుకే యూదుల ప్రధాన యాజకులు పరిసయ్యులు యేసును పట్టుకొనుటకని కొందరు బంట్రోతులను పంపితే వారాయనను పట్టుకొనలేదు సరిగదా ఆ

మనుష్యుడు మాటలాడినట్లు ఎవడును ఎన్నడును మాటలాడ లేదని సాక్ష్యమిచ్చిరి (యోహాను 7:46).

## ఆశ్చర్యకరమైన క్రియలు

యేసు చేసిన క్రియలు ఆయన దేవుని కుమారుడని నిరూపించుచున్నవి. "నేను నా తండ్రి క్రియలు చేయనియెడల నన్ను నమ్మకుడి, చేసినయెడల నన్ను నమ్మకున్నను తండ్రి నాయందును నేను తండ్రియందును ఉన్నానని మీరు గ్రహించి తెలుసుకొనునట్లు ఆ క్రియలను నమ్ముడని" క్రీస్తు బోధించెను (యోహాను 10:38). ప్రకృతి శక్తుల మీద ఆయన అధికారము కలిగియుండెను. ఆయన తుఫానును గద్దింపగా గాలి, సముద్రము నిమ్మళమాయెను (మత్తయి 8:23-27). ఆయన నీటిపై నడచెను, నీళ్ళను ద్రాక్షారసముగ మార్చెను.

మనుష్యులను పీడించు వ్యాధులపై ఆయన అధికారము కలిగియుండెను. కుష్ఠరోగి ఒకడు వచ్చి ఆయనకు మ్రొక్కి ప్రభువా, నీకిష్టమైతే నన్ను శుద్ధునిగా చేయగలవనెను. అందుకాయన చెయ్యి చాపి వానిని ముట్టి నాకిష్టమే, నీవు శుద్ధుడవు కమ్మని చెప్పగా తక్షణమే వాని కుష్ఠరోగము శుద్ధియాయెను (యోహాను 8 : 2-4). పండ్రెండు సంవత్సరములనుండి రక్త స్రావముచే బాధపడుచున్న స్త్రీ యొకతె ఆయన వస్త్రపు చెంగు ముట్టెను. యేసు వెనుకకు తిరిగి ఆమెను చూచి కుమారీ, ధైర్యముగా ఉండుము, నీ విశ్వాసము నిన్ను బాగుపరచెనని చెప్పగా, ఆ ఘడియనుండి ఆ స్త్రీ బాగుపడెను (మత్తయి 9:20-22).

రోగమే కాదు, మరణముకూడ క్రీస్తుకు లోబడెను. ఆయన చనిపోయిన లాజరును మరల బ్రదికించెను. యేసు అనేక అద్భుతములను చేసెను. వాటిలో కొన్ని మాత్రమే క్రొత్త నిబంధనలో వ్రాయబడెను. మనము యేసునందు విశ్వాసముంచ గల్గునట్లు అవి

వ్రాయబడెను (యోహాను 20 : 30, 31). యేసునుగూర్చి బైబిలునందు వ్రాయబడిన సంగతులను మనము నిరభ్యంతరముగా నమ్మవచ్చును. బైబిలును వ్రాసిన లేఖకులు దేవుని ఆత్మచే నడిపింపబడిరి. సరిగదా వారు ఏది వింటిరో, కన్నులార ఏది చూచితిరో, నిదానించి ఏది కనుగొంటిరో, వారి చేతులు దేనిని తాకి చూచెనో దానిని గూర్చి వారు వ్రాసిరి. అంతేకాదు ఆ లేఖకులు తాము విశ్వసించిన దాని కొరకు తమ ప్రాణములను కూడ అర్పించిరి గనుక వారిచ్చిన సాక్ష్యము యధార్థమని మనమంగీకరించవచ్చును.

క్రీస్తు ఈలోకమునందుద్భవించినది మొదలుకొని చరిత్రయొక్క గతియే మార్చబడినది. కాలము ఆయన రాకడను బట్టి లెక్కింపబడుచున్నది. నాటినుండి నేటివరకు ఆయన నామము లోకమందంతట ప్రకటింపబడుచుండగా కోట్లకొలది ప్రజలు ఆయన దేవుని కుమారుడని విశ్వసించి ఆయనకు విధేయులగుచున్నారు. మిత్రుడా, క్రీస్తుని గూర్చి నీకేమి తోచుచున్నది? ఆయన దేవుని కుమారుడని నిరూపించు అనేక ఋజువులను ఈనాడు నీకు చూపించితిని. నీవు నీ పాపములనుండి విముక్తుడవు కావలనంటే యేసునందు విశ్వాసముంచుము. నీ పాపముల విషయమై మారుమనస్సు నొందుము. క్రీస్తు నామమును బహిరంగముగా ఒప్పుకొనుచు, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. క్రీస్తే దేవుని కుమారుడని లోకానికి ప్రకటించుచూ ఆనంద జీవితమును జీవించుము!

—జాషువా గూటం.

— o —

## సంఘము ప్రాముఖ్యమా?

## ( Is the Church Important ? )

క్రీస్తే ఘనపరచ బడాలని, సంఘము అంత ప్రాముఖ్యము కాదనే బోధ తరచు వినబడుచున్నది. నీ యిష్టమొచ్చిన సంఘంలో

నీవు చేరవచ్చు, అసలు ఏ సంఘములోను లేకుండా నీవుండవచ్చు అని వారు చెబుతూ యుంటారు. ఈ వాదనకు బైబిలుసే జవాబు నీయనిద్దాం.

మానవుడున్న స్థితిలో బైబిలు కూడ తానున్న స్థితిలో సరి పోవును. బైబిలుపై వ్యాఖ్యానించడానికి బైబిలు మాత్రము సరిపోవు నన్న రెండు వాస్తవాలను మనం గుర్తుంచుకోవాలి (2 తిమోతి 3 : 16, 17). నేనొక సువార్త సభలో ప్రసంగించిన యనంతరము ఒకడు వచ్చి బాప్తిస్మమునుగూర్చి "మూడీగారు ఏమిచెప్పారో తెలుసా?" యని నన్నడిగాడు. నాకు తెలియదుగాని అపొ. పౌలు యేమి చెప్పాడో నాకు తెలుసని జవాబిచ్చేను. బైబిలును వ్యాఖ్యా నించడానికి బైబిలే చక్కటి వ్యాఖ్యానకర్త యని మీకు చూప గోర్తాను.

తన సంఘము ఒక బండపై నిర్మించబడునని యేసు చెప్పాడు. ఈ బండ పేతురని కొందరు వ్యాఖ్యానకర్తలు వ్రాసారు. లేఖనము లేమి చెప్పుచున్నవి? "వేయబడినది తప్ప వేరొక పునాది ఎవడును వేయనేరడు; ఈ పునాది యేసుక్రీస్తే" యని 1 కొరింథీ 3:11 చెప్పు చున్నది. ఆ బండ క్రీస్తే యని 1 కొరింథీ 10:4 చెప్పుచున్నది. గనుక ఈ ప్రాథమిక సత్యాలను మానవకల్పిత వ్యాఖ్యానాలు యేమీ మార్చ వేవు (హెబ్రీ 13 : 8).

## క్రీస్తు శరీరము

సంఘము క్రీస్తుయొక్క శరీరమై యున్నది. (ఎఫెసీ 1:22-23). క్రీస్తు శరీరాన్ని వికృతంగా మనం మార్చగలమా? ఆ శరీరాన్ని ఇంకో శరీరంగా మార్చగలమా? (ఎఫెసీ 4:4). అట్లు కాదు. సంఘము కళంకమైనను, ముడతయైనను లేక క్రీస్తుకు ప్రదానము చేయబడాలి (ఎఫెసీ 5 : 27). క్రీస్తే శరీరమునకు రక్షకుడై యున్నాడు (ఎఫెసీ

5:23). క్రీస్తు తన సంఘమును స్వరక్తమిచ్చి కొన్నాడు (అపొ.కా. 20:28). సువార్త సర్వసృష్టికి ప్రకటింపబడాలని యేసు చెప్పాడు (మార్కు 16 : 15). ఇహపరములయందు ఆయనకు సర్వాధికార మున్నది (మత్త 28 : 18). ఆయన తనకు విధేయులైనవారి నిత్యరక్షణకు కారకుడు (హెబ్రీ 5:9).

మనము విశ్వాస మూలముగా నీతిమంతులని తీర్చబడి యున్నాము (రోమా 5:1). దేవుని వాక్యం వినుటవలన విశ్వాసము కలుగును (రోమా 10 : 17). విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము (హెబ్రీ 11 : 6). అపొస్తలుల ద్వారా మన కందించబడిన వాక్యమును మనం విశ్వసించాలని యేసు ప్రార్థించాడు (యోహాను 17:20-21). అపొస్తలుల మాటలను మనం విశ్వసించు లాగున మనకు లిఖితపూర్వకమైన వాక్యమున్నది (యోహాను 20:30-31). విశ్వాసము పరిశుద్ధులకు ఒక్కమారే అప్పగింపబడెను (యూదా : 3).

మనలను క్రీస్తు నొద్దకు నడిపించుటకు పాత నిబంధన బాలశిక్షకుడాయెను. ఇప్పుడు క్రీస్తు వచ్చేసినందున ఇక బాలశిక్షకుని క్రింద లేము (గల 3:24-25). యేసు ముగ్గురు శిష్యులతో కూడ ఒక కొండమీద ఉండగా మోషే, ఏలియాలు వారికి కన్పడిరి. వారిలో మోషేకొక ఆలయం ఏలీయాకు ఒక ఆలయం, యేసుకు ఒక ఆలయం నిర్మించుదామని పేతురు సలహా నియ్యబోయాడు. అప్పుడు పరలోకం నుండి దేవుడే పలికాడు. "నా కుమారుని మాట వినుడి" యని ఆత్మావేశ కలమును యోహాను వినియోగించుట కంతమయి నప్పుడు ఆ గ్రంథానికి కలుపుట తీసివేయుట కలుగరాదని దేవుడే చెప్పాడు (ప్రక 22:18-19).

## సంఘముకు కూడ ఘనత

యుగయుగములలోను క్రీస్తుతో కూడ సంఘము ఘనపరచ

బడాలి (ఎఫెసీ 3:20-21). మానవులు అనేక మతశాఖలను తయారు చేసారు. అయితే అవి పెల్లగింపబడునని యేసు చెప్పాడు మత్త 15 : 13). దైవిక సంస్థయైన సంఘము సరియైన కాలంలో సరియైన స్థలంలో ఆరంభమాయెను. యెహోవా ధర్మశాస్త్రము యెరూషలేమునుండి బయలు వెళ్ళునని ప్రకటించాడు. దేవుని మందిరం అక్కడనుండి ఆరంభమగును (యెషయా 2:2-3).

అపొస్తలు లందరు ఒకచోట కూడారు. వారిని సర్వసత్యములోనికి నడిపించుటకు పరిశుద్ధాత్ముడు దిగివచ్చాడు. సువార్త ఒక వాస్తవిక సత్యమయ్యింది. క్రీస్తు మృతులలోనుండి లేపబడ్డాడు. ఆయన పరలోకమునకు తిరిగి వెళ్ళాడు (అపొ.కా. 1:8-11). యెరూషలేము మొదలుకొని ఆయన నామమున మారుమనస్సు పాపక్షమాపణ ప్రకటింపబడునని యేసు చెప్పాడు (లూకా 24:46-47).

పరిశుద్ధాత్మ యెందువలన వచ్చెనో పేతురు వారికి బోధించాడు. తరువాత అతడు క్రీస్తుయొక్క మరణ సమాధి పునరుత్థానముల వాస్తవములను ప్రకటించాడు. యిది నిజమని వారు నమ్మారు. వారు తమ హృదయములో నొచ్చుకొన్నారు (అపొ. కా. 2 : 37). మేమేమి చేతుమని వారడిగారు. దానికి జవాబు అపొస్తలుల యొద్దనుండియే గాక పరిశుద్ధాత్మనినుండి కలిగింది. "మీరు మారుమనస్సు బొంది మీలో ప్రతివాడును యేసుక్రీస్తు నామమున పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుడి. అప్పుడు పరిశుద్ధాత్మ అను వరము మీకనుగ్రహింపబడును" (అపొ, కా. 2:38). యిది ఎవరికి వర్తించును? 39వ వచనము జవాబిస్తుంది. "ఈ వాగ్దానము మీకును, మీ పిల్లలకును దూరస్థులందరికిని అనగా ప్రభువైన దేవుడు తనయొద్దకు పిలిచినవారి కందరికిని చెందును". ఏమి జరిగింది? అతని వాక్యము నంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి. ఆ దినమందు ఇంచుమించు మూడువేల మంది చేర్చబడిరి (అపొ. కా. 2:41).

ఈ సంఘము యేమి చేసిరి? "వారు అపొస్తలుల బోధయందును, సహవాసమందును, రొట్టె విరుచుటయందును, ప్రార్థన చేయుట యందును ఎడతెగక యుండిరి" (అపొ.కా. 2:42). అవును సంఘము ప్రాముఖ్యమే. ప్రాముఖ్యముకాని దానికొరకు క్రీస్తు చనిపోలేదు.

—జె.సి. బెయిలీ.

— o —

## అధైర్యము

## ( Discouragement )

పరలోకంవైపు పయనిస్తున్న అనేక నౌకలు అధైర్యము అనే తుఫానులో మునిగిపోయాయి. నిత్య బహుమానాన్ని అందుకోడానికి కృషి చేయుచున్న వారిని కూలద్రోయడానికి అపవాది ఉపయోగించే శక్తివంతమైన ఒక సాధనము యిది. మనం దేవుని పిల్లలమైతే సమస్త మును మేలు కలుగుటకై సమకూడి జరుగునని గుర్తించుకోవాలి. లేని యెడల మనం నిరుత్సాహపడిపోతే అపవాది మనపై విజయం సాధి స్తాడు. "ఇదిగో నీ దేవుడైన యెహోవా ఈ దేశమును నీకు అప్ప గించెను. నీ పితరుల దేవుడైన యెహోవా నీతో సెలవిచ్చినట్లు దాని స్వాధీనపరచుకొనుము. భయపడకుము, అధైర్యపడకుము అని నీతో చెప్పితిని" (ద్వితీ 1:21).

ఐగుప్తు దేశాన్ని విడనాడిన అనేకమంది ఇశ్రాయేలీయులు అధైర్యము వలన వాగ్దాన దేశములో ప్రవేశించలేక పోయారు. మోషే వారి నాయకుడు, వారు అధైర్యపడవద్దు, నిరుత్సాహపడవద్దని అతడు వారిని హెచ్చరించాడు. దేవుడు వారికి తోడైయుండి వారి కొరకు యుద్ధము చేయుదునని చెప్పాడు. వారికొరకు సమస్తము సమకూడి జరుగుచున్నను, వారు నిరుత్సాహ పడుచునే యుండిరి. కానాను దేశాన్ని వేగు చూచుటకు వారు 12 మందిని పంపారు.

వారిలో పదిమంది అధైర్యకరమైన వర్తమానాన్ని తీసికొచ్చారు. పాలు తేనెలు ప్రవహించు దేశాన్ని గూర్చి వారు చెప్పినా పెద్దపెద్ద ప్రాకారములను గూర్చి, భీకరమైన మనుష్యులను గూర్చి కూడ వారు చెప్పారు. ఈ పదిమంది అవిశ్వాసుల వర్తమానాన్ని ప్రజలు వినినప్పుడు యోర్దానునది దాటి వాగ్దాన దేశములో ప్రవేశించుటకు వారు నిరాకరించారు. ఐగుప్తును విడనాడుసరికి ఇరవై సంవత్సరములు లేక అంతకుపైగా వయస్సు కలిగిన వారందరు అరణ్యములో నశించారు.

పాతనిబంధనలోని మాదిరులు మనకు బుద్ధి కలుగు నిమిత్తము వ్రాయబడ్డాయి. అధైర్యము వలన అరణ్యములో నశించిన ఈ అవిశ్వాసులవలె మనముండరాదు. విశ్రాంతి పొందే నిత్య దేశాన్ని దేవుడు మన ముందుంచాడు. మనం వెళ్ళి దాన్ని స్వాధీనపరచుకోవాలి. భయపడకూడదు, అధైర్యపడకూడదు.

మనలో ప్రతివాడు అపజయాన్ని, నిరుత్సాహాన్ని చవిచూచిన వాడే. అయితే మనం నిరీక్షణ లేనివారము కాము. నీవు దేనినైనా ప్రయత్నించి అపజయం పొందితే, అపజయానికి కారణమైన సంగతులే మరొక విజయాన్ని సాధించుటకు సహాయపడ్తాయి. నిన్ను నీవే నిందించుకొంటూ కూర్చునే కంటే దేవునిపై భారము వేసి ముందుకు సాగుట మంచిది.

—డేవిడ్ మేసే (TVC).

— 0 —

## ఆందోళనలు

### ( Worries )

ప్రస్తుతంలో గాక భవిష్యత్తులో సంభవింపబోయే సంగతులను గూర్చి చింతించడం ఆందోళనకు కారణం. ఏదో విపత్తు సంభవించు ననే భయం ఆందోళనకు దారితీస్తుంది. అట్టి ఆందోళనలకు గురియైన

వారు దేవుని తట్టు తిరిగితే వారి ఆందోళనలకు విరుగుడు లభిస్తుంది. దేవుని తత్వరి ఆయన వాక్యంలో స్పష్టంగా కనబడుతుంది.

సమస్తము దేవుని అదుపులో యున్నది. దేవుని అదుపులో లేకుండా, ఆయనకు తెలియకుండా ఈ లోకంలో యేమీ జరుగదని బైబిలు బోధించుచున్నది. "యెహోవా ఆకాశమందు తన సింహాసనమును స్థిరపరచి యున్నాడు. ఆయన అన్నిటిమీద రాజ్యపరిపాలన చేయుచున్నాడు" (కీర్తన 103:19). "ఆయన తన పరాక్రమము వలన నిత్యము ఏలుచున్నాడు" (కీర్తన 66:7). ఆయన సార్వభౌముడు.

ఏదో అదుపు తప్పిపోయిందని, ఘోరవిపత్తు జరుగునని, దాన్ని వారు ఆపలేరని ఆందోళనకారులు ఆలోచిస్తారు. అట్టివారు దేవుని గూర్చి కూడ ప్రాముఖ్య సత్యములను గుర్తుంచుకోవాలి.

1. దేవుడు అన్ని చోట్ల యున్నాడు (కీర్తన 139:7; యిర్మీ 23 : 23-24) : దేవుడు లేనిచోటు యేదీ లేదు. మనం ఎక్కడ ఎంత ఏకాంతంగా యున్నా అక్కడ దేవుడున్నాడు. ఆయన సర్వాంతర్యామి.

2. దేవుడు సమస్తాన్ని ఎరిగినవాడు (యోబు 7 : 20; కీర్తన 33:13) : మనం ఎంత భయస్థులమో ఆయన ఎరుగును.మనకు దేనిని గూర్చి ఎంత భయమో ఆయన ఎరిగినవాడు. మనం ఆందోళన చెందేదేలంటే దేవుడు మన పరిస్థితిని గూర్చి ఎరిగినవాడు కాదని మన యభిప్రాయం. "ఆయన మిమ్మునుగూర్చి చింతించుచున్నాడు గనుక మీ చింత యావత్తు ఆయనమీద వేయుడి" (1 పేతురు 5 : 8). భవిష్యత్తు మనం ఎరుగము గాని దేవుడెరుగును. సమస్తము ఏలాగు జరుగునో ఆయనకు తెలుసు. మన అవసరాలన్నీ ఆయన ఎరుగును.

3. దేవుడు మీ భారములను భరించును (1 పేతురు 5:7; కీర్త 55:22): ఈ జీవిత భారములన్నీ మనం ఆయనకు అప్పగించవచ్చును; ఒక సింహాన్ని, ఫిలిష్తీ అజానబాహుని హతం చేయుటకు ఆయన

దావీదుకు సహాయం చేసాడు. సౌలుచేతిలో అతడు చిక్కకుండా దేవుడు దావీదును సంరక్షించాడు. అందువలననే దావీదు ఇట్లు చెప్పగలిగాడు: "నీ భారము యెహోవామీద మోపుము. ఆయనే నిన్ను ఆదుకొనును. నీతిమంతులను ఆయన ఎన్నడు కదలనీయడు" (కీర్త 55:22).

మన భారములను దేవునిపై ఎట్లు మోపుదుము? మనం ఎరిగిన దానిని బట్టి ప్రవర్తించుటయే. ఆయన సర్వశక్తిమంతుడు, నమ్మదగిన దేవుడని ఎరుగుదుము. ఆందోళన జెందునప్పుడు ఆయన యందున్న మన విశ్వాసాన్ని కొంత కోల్పోతాము. ఆయనకంటే మనకే ఎక్కువ తెలుసు అన్నట్లు ప్రవర్తిస్తాము. "నీ మార్గమును యెహోవాకు అప్పగింపుము. నీవు ఆయనను నమ్ముకొనుము. ఆయన నీ కార్యము నెరవేర్చును" (కీర్తన 37:5).

—టామ్ కెల్టన్ (TVC)

—o—

## "మెలకువగా ఉండుడి" (మత్త 25 : 13)

## ( Watch Ye Therefore )

మెలకువ అను పదము బైబిలునందు ఎంతో ప్రాముఖ్యతను కలిగియున్నది. మెలకువ అనగా కేవలం నిద్రనుండి మెలకువ మాత్రమే కాదుగాని, మానవజీవిత సమస్యలలో ఎంతో మెలకువ కలిగియుండవలెను. లేనిచో జీవితం ఎంతో దుర్భరమై పోతుంది. ఉదాహరణకు; ఒక మనుష్యుడు రైలులో ప్రయాణం చేయుచు తాను దిగవలసిన స్టేషన్ వచ్చి రైలు ఆగినను మెలకువగా లేనందున అతడు అచ్చట దిగలేకపోయెను. రైలు ముందుకు సాగిపోయెను. ఇంతలో రైల్వే అధికారులు వచ్చి మధ్యలోనే అతనిని దింపివేసిరి. అప్పుడు అతని పరిస్థితి ఎంత దుర్భరము? "అంతట తలుపు వేయబడెను. ఆ తరువాత తక్కిన (బుద్ధిలేని) కన్యకలు వచ్చి, అయ్యా; అయ్యా, మాకు తలుపు తీయుమని అడుగగా! అతడు మిమ్ము నెరుగనని మీతో

నిశ్చయముగా చెప్పుచున్నానను" (మత్త 25:11, 12). ఆ కన్యకలు ఎంతో ప్రయాసపడి వున్నను మెలకువగా లేనందున వెలుపలనే ఉండిపోయిరి. మెలకువ కలిగి వున్నందుననే రాజైన సౌలు విసరిన ఈటెనుండి దావీదు రెండు మారులు తప్పించుకొనెను (1 సమూ 18:10). బుద్ధికలిగిన 5 గురు కన్యకలు మెలకువ కలిగి యుండిరి గనుక పెండ్లి కుమారునితో పెండ్లి విందులో పాల్గొనిరి (మత్త 25 : 10). చూశారా; "మెలకువ" ఎంత ప్రాముఖ్యమైనదో! కాబట్టి ప్రతి మనుష్యుడు మెలకువ కలిగి యుండుట ఎంతో ఆవశ్యం.

**I మనము ఎందుకు మెలకువ కలిగి యుండాలి? :—**

దీనికి పరిశుద్ధ గ్రంథమే జవాబై యున్నది. "ఆ దినమైనను ఘడియైనను మీకు తెలియదు గనుక మెలకువగా ఉండుడి" (మత్త 25 : 13). కాబట్టి మనము ఆ దినముకొరకు మెలకువ కలిగియుండవలెను. అది ఏ దినము? అది యేసు రెండవరాక దినము. "...క్రీస్తుకూడ అనేకుల పాపములను భరించుటకు ఒక్క సారే అర్పింపబడి తన కొరకు కనిపెట్టుకొని యుండువారి రక్షణ నిమిత్తము పాపము లేకుండ రెండవసారి ప్రత్యక్షమగును" (హెబ్రీ 9 : 28). కనుక మనము యేసు రెండవ రాకడకొరకు మెలకువ కలిగి యుండవలెను. ఈ విషయమై యేసుప్రభువు అనేక హెచ్చరికలు చేసి యున్నాడు.

1. "నాతండ్రి యింట అనేక నివాసములు కలవు. లేనియెడల మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధపరచ వెళ్ళుచున్నాను. నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచినయెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరలా వచ్చి మిమ్ము తీసికొని పోదును" (యోహా 14 : 2, 3).

2. పునరుత్థానుడైన యేసు తన శిష్యులకు "అనేక విషయ

ములు చెప్పి, వారు చూచుచుండగా ఆరోహణుడాయెను. . .ఆయన వెళ్ళుచుండగా వారు ఆకాశమువైపు చూచుచుండిరి. ఇదిగో తెల్లని వస్త్రములు ధరించుకొనిన యిద్దరు మనుష్యులు వారియొద్ద నిలిచి, గలిలయ మనుష్యులారా, మీరెందుకు నిలిచి ఆకాశమువైపు చూచుచున్నారు? మీయొద్దనుండి పరలోకమునకు చేర్చుకొనబడిన యీ యేసే, ఏరీతిగా పరలోకమునకు వెళ్ళుట మీరు చూచితిరో ఆ రీతిగానే ఆయన తిరిగి వచ్చునని వారితో చెప్పిరి" (అ. కా. 1:9-11). కాబట్టి ఆ రెండవ రాకడ దినముకొరకై మనము మెలకువ కలిగి యుండవలెను.

II యేసుప్రభువు ఎప్పుడు వచ్చును ? ఈ విషయమై కొందరు తప్పుడు బోధకులు యేసు రాకడనుగూర్చి అనేక అబద్ధ ప్రచారములు చేసియుండిరి. అట్టివారిలో:

(1) విలియం మిల్లర్:- ఇతడు సెవెంత్ డే ఎడ్వెంటిస్ట్ మత స్థాపకుడు. ఇతడు 1843 లోను, 1844 మార్చి 21న యేసు రెండవరాకడ వచ్చునని ప్రకటించి ప్రజలను ఎంతో గందరగోళ పరచెను.

2) పాస్టరు రస్సెల్ :- ఈయన 1890 లో యేసుక్రీస్తు 1974 లో రెండవరాకడ వచ్చునని ప్రకటించెను.

3) రూదర్ ఫర్డ్ :- ఇతడు 1925 లో యేసుక్రీస్తు వచ్చునని ప్రకటించెను. పాఠకులారా; ఇది ఎంతటి అబద్ధ బోధ? అందుకే పేతురు "అబద్ధ ప్రవక్తలు ప్రజలలో పుండిరి, అటువలెనే మీలోను అబద్ధ బోధకు లుందురు; వీరు తమ్మును కొనిన ప్రభువునుకూడ విసర్జించుచు, తమకుతామే నాశనము కలుగజేసికొనుచు, నాశనకరమగు భిన్నాభిప్రాయములను రహస్యముగా బోధింతురు" (2 పేతు 2 : 1). పై చెప్పినవారు ఇట్టివారే. వీరేగాక; ప్రస్తుతం అభివృద్ధి చెందుచున్న

సంఘములను చూచి ఓర్చుకొనలేని కొందరు కపట సోదరులు అసూయతో నిండిన మనస్సు గలవారై సత్యవాక్యమును ప్రకటించలేక, సంఘములలోను, సహోదరులలోను కలతలు సృష్టించి దేవుని పని పాడుచేయు సత్యవిరోధులు మనలో ఎందరో కనబడుచున్నారు. ఇట్టి క్రూరమైన తోడేళ్ళ విషయంలో "మెలకువ" కలిగియుండుడని పరిశుద్ధాత్ముడు మనలను హెచ్చరించుచు జ్ఞాపకము చేయుచున్నాడు (అపో.కా. 20:29, 30). కాబట్టి ప్రతి క్రైస్తవుడు మెలకువ కలిగి యుట్టివారిని కనిపెట్టి గద్దించి బుద్ధి చెప్పవలెను. అయితే యేసు ఎప్పుడు వచ్చును? ఈ విషయమై లేఖనములు ఏమి చెప్పుచున్నవి?

యేసు ఇట్లు చెప్పెను. 1) "ఆ దినమైనను గడియైనను మీకు తెలియదు గనుక మెలకువ కలిగియుండుడి" మత్త 25 : 13.

2) "అయితే ఆ దినమును గూర్చియు, ఆ గడియనుగూర్చియు తండ్రి మాత్రమే యెరుగునుగాని, ఏ మనుష్యుడైనను పరలోక మందలి దూతలైనను, కుమారుడైనను ఎరుగరు. నోవహు దినములలో ఎలాగుండెనో మనుష్య కుమారుని రాకడయు అలాగే యుండును" మత్త 24:36, 37.

3) మీరనుకొనని ఘడియలో మనుష్య కుమారుడు వచ్చును గనుక మీరు సిద్ధముగా ఉండుడి. మత్త 24:44. మరియు పరిశుద్ధాత్ముడు ప్రభువు దినము దొంగవలె వచ్చునని మనకు జ్ఞాపకము చేయుచున్నాడు (2 పేతు 3:10, 1 థెస్స 5:2). కాబట్టి ఆదినంకొరకు మనం మెలకువ కలిగియుండవలెను.

**III యేసుప్రభు రెండవరాకడ దినమున ఏమి జరుగును:**-ప్రతి సమస్యకు బైబిలే సమాధానమను విషయం మనం మరువరాదు.

1) భూమియు ఆకాశము గతించిపోవును :-"అయితే ప్రభువు దినము దొంగవచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహా ధ్వనితో గతించిపోవును, పంచభూతములు మిక్కుటమైన వేండ్రముతో లయమైపోవును; భూమియు, దానిమీద కృత్యములు కాలిపోవును" 2 పేతు 3 : 10. సత్యవాక్యము యిట్లు చెప్పుచుండగా యేసు రెండవసారి వచ్చినప్పుడు భూమిమీద రాజ్యము స్థాపించి వెయ్యేండ్లు పాలించుననుట ఎంత వెర్రితనము?

2) తీర్పు జరుగును :-"తన మహిమతో మనుష్య కుమారుడు ఆయనతో కూడ సమస్త దూతలును వచ్చినప్పుడు ఆయన తన మహిమగల సింహాసనముపై కూర్చుండును. సమస్త జనులు ఆయన యెదుట పోగుచేయబడుదురు. గొల్లవాడు గొర్రెలను, మేకలను వేరుపరచునట్లు ఆయన వారిని వేరుపరచి తనకు కుడివైపున గొర్రెలను, ఎడమ వైపున మేకలను నిలువబెట్టును. అప్పుడు రాజు తనకు కుడివైపున ఉన్నవారిని చూచి నా తండ్రిచేత ఆశీర్వదించబడిన వారలారా రండి; లోకము పుట్టినది మొదలుకొని మీ కొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి". మత్తై 25:31-34. అలాగే "అప్పుడాయన యెడమ వైపున ఉండువారిని చూచి - శపించబడిన వారలారా నన్ను విడచి అపవాదికిని వాని దూతలకును సిద్ధపరచబడిన నిత్యాగ్నిలోనికి పోవుడి" మత్తై 25:41. "వీరు నిత్య శిక్షకును నీతిమంతులు నిత్యజీవితమునకును పోవుదురు" మత్తై 25:46.

IV) యేసు రెండవరాకడకు ముందే చనిపోయిన వారి సంగతి ఏమి ?

1) "దీనికి ఆశ్చర్యపడకుడి; ఒక కాలము వచ్చుచున్నది. ఆకాలమున సమాధులలో నున్న వారందరు ఆయన శబ్దము విని మేలుచేసినవారు జీవపునరుత్థానమునకును; కీడుచేసినవారు తీర్పు పునరుత్థానమునకును బయటకు వచ్చెదరు" (యోహాను 5:28, 29).

2) "యేసు మృతిపొంది లేచెనని మనము నమ్మిన యెడల అదేప్రకారముగా యేసునందు నిద్రించిన వారిని దేవు డాయనతో కూడ వెంటబెట్టుకొని వచ్చును. మేము ప్రభువు మాటనుబట్టి మీతో చెప్పునదేమనగా ప్రభువు రాకడవరకు సజీవులమై నిలిచియుండు మనము నిద్రించినవారికంటే ముందుగా ఆయన సన్నిధి చేరము. ఆర్భాటముతోను ప్రధాన దూత శబ్దముతోను దేవుని బూరతోను పరలోకమునుండి ప్రభువు దిగివచ్చును. క్రీస్తునందుండి మృతులైన వారు మొదట లేతురు. ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము వారితో కూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశ మండలమునకు మేఘములమీద కొనిపోబడుదుము" (1 థెస్స 4:14-17). కావున క్రీస్తునందు మృతులైనవారు ధన్యులు అని బైబిలు వక్కాణించుచున్నది.

**V) తీర్పు తరువాత ఏమి జరుగును?:** "అటు తరువాత ఆయన సమస్తమైన ఆధిపత్యమును సమస్తమైన అధికారమును బలమును కొట్టివేసి తన తండ్రియైన దేవునికి రాజ్యము అప్పగించును; అప్పుడు అంతము వచ్చును" (1 కొరిం 15:24). ఆరాజ్య మేది యని ఆలోచించుచున్నావా? అది, బాప్తిస్మమిచ్చు యోహాను ప్రకటించిన రాజ్యము (మత్త 3 : 1, 2). అది యేసు బోధింప మొదలుపెట్టిన రాజ్యము (మత్త 4 : 17). అదియే క్రీస్తు స్థాపించిన (సంఘము) రాజ్యము.

ప్రియ చదువరీ! నీవు యింకను దేవుని రాజ్యము (క్రీస్తు సంఘము) లో చేరి యుండనిచో మేల్కొనుము; ఇదియే, ఇప్పుడే మిక్కిలి అనుకూల సమయము, నేడే రక్షణ దినము (2 కొరిం 6:2). మతశాఖల మత్తులోనుండి, అబద్ధ బోధకుల అలజడిలోనుండి "మెలకువ" కలిగి, యేసునందు విశ్వాసముంచి మారుమనస్సు పొంది,

యేసు దేవుని కుమారుడని నీ నోటితో ఒప్పుకొని బాప్తిస్మము పొంది దేవుని రాజ్యములో ప్రవేశించుము. అప్పుడు "...మనము సదా కాలము ప్రభువుతో కూడ ఉందుము" (1 థెస్స 4:17).

—జి. మార్కు, నందిగామ.

—o—

## బైబిలు బయలుపరచు దేవుడు

## (The God the Bible Reveals)

"ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను" అను వాక్యముతో బైబిలు ఆరంభమగుచున్నది (ఆది 1:1). శూన్యము నుండి యేమీ రాదు అనే మాట కలదు. జీవము దానికి ముందున్న జీవమునుండి కలుగును. మానవ జ్ఞానమంతయు ఈ మాటల సత్యాన్ని అంగీకరించును. ఒక విధంగా చెప్పాలంటే నిర్దేవులంటూ ఎవరు నిజంగా లేరు. సైనికుడు త్రవ్వుకున్న గుంటల్లో దేవుడు లేడని చెప్పేవాడెవడు మొదటి ప్రపంచ యుద్ధంలో లేరట!

మనకు చెట్లు, కాయగూరలు ఉన్నాయి. అవన్నీ వాటికవే కలిగెనని కొందరు నమ్ముతారు. ఇటువంటి వాదనలనెన్నో చేస్తారు. అయితే గోధుమగింజలనుండి నిమ్మకాయలు రావు. ప్రకృతి చట్టాన్ని మానవుడు తయారు చేయలేదు. దానికి దేవుడే కర్త. దేవుడు నిత్యుడని బైబిలు బయలుపరచుచున్నది. "పర్వతములు పుట్టకమునుపు భూమిని లోకమును నీవు పుట్టింపక మునుపు యుగయుగములు నీవే దేవుడవు" (కీర్త 90 : 2). ఐగుప్తులో బానిసలుగా యున్నప్పుడు మానవులు నిజదేవుని మరిచారు. అయితే అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులు నిజదేవుని సేవించారని వారెరుగుదురు. గనుక మోషే వారి యొద్దకు వెళ్ళినప్పుడు ఇట్లు చెప్పవలెనని దేవుడతనికి సలహా నిచ్చాడు: "నేను ఇశ్రాయేలీయుల యొద్దకు వెళ్ళి వారిని చూచి - మీ పితరుల దేవుడు మీయొద్దకు నన్ను పంపెనని వారితో

చెప్పగా వారు - ఆయన పేరేమి అని అడిగినయెడల, వారితో నేనేమి చెప్పవలెనని దేవుని నడిగెను. అందుకు దేవుడు - నేను ఉన్నవాడను అనువాడనై యున్నానని మోషేతో చెప్పెను" (నిర్గమ 3:13-14). గనుక దేవునికి ఆదిలేదు, అంతముకూడ లేదు. ఆయన ఎల్లప్పుడు ఉండువాడు.

ఆయన విగ్రహారాధనను నిశితముగా ఖండించుచున్నాడు. "నేనుతప్ప వేరొక దేవుడు నీకుండకూడదు" (నిర్గమ 20:3). "ప్రభువైన నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రమే నీవు సేవింపవలెను" (మత్తయి 4 : 10). ఇంకా దేవుని వాక్యమునుండి ఇట్లు నేర్చుకొనగలము: "పూర్వకాలమందు నానా సమయములలోను, నానావిధములుగాను ప్రవక్తలద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు ఈ దినముల అంతమందు కుమారునిద్వారా మనతో మాటలాడెను. ఆయన ఆ కుమారుని సమస్తమునకు వారసునిగా నియమించెను, ఆయనద్వారా ప్రపంచములను నిర్మించెను" (హెబ్రీ 1:1-2). యేసు కొండమీద రూపాంతరము పొందినప్పుడు దేవుడు, "ఇదిగో ఈయన నా ప్రియ కుమారుడు, ఈయనయందు నేనానందించుచున్నాను, ఈయన మాట వినుడి" యని పలికెను (మత్తయి 17:5). మరియు ఆయన సంపూర్ణసిద్ధి పొందినవాడై తనకు విధేయులైన వారందరికిని నిత్యరక్షణకు కారకుడాయెను (హెబ్రీ 5:10).

దేవుని ప్రకృతి సృష్టి గతించిపోవును గాని ఆయన వాక్యము ఎల్లప్పుడు నిలుచును(మత్త 24:35). ఆయనను మనము సంఘముద్వారా సేవింపవలెనని సత్యవాక్యము చెప్పుచున్నది (ఎఫె 3:20-21).

—J.C. బెయిలీ.

— o —

# సంక్షిప్త వార్తలు

జూన్ నెల 18వ తేదీ శుక్రవారంనాడు నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి APSP కేంప్‌లో క్రీస్తుసంఘ ఆలయ ప్రతిష్ట జరిగినది. ఈ ఆలయం నిర్మించుటకు స్థానిక సంఘస్థులకు 9 సంవత్సరములు పట్టినది. ఏవిధమైన విదేశీ సహాయం లేకుండా, మెయిన్‌రోడ్ ప్రక్కన విశాల మైన ఆవరణలో వైభవోపేతముగా నిర్మించబడిన ఆలయాన్ని Bro. జాషువా గూటంగారు రిబ్బను కత్తిరించి, దేవుని మహిమ కొరకు ప్రతిష్టించిరి. పలు ప్రాంతములనుండి వచ్చిన వెయ్యిమంది సోదర సోదరీలతో ఆలయం నిండిపోయింది. ఈ ఆలయ నిర్మాణానికి సహోద రులు N. సైటస్‌గారు, N. రాములుగారు నిర్విరామ కృషి చేసిరి. సైటస్‌గారు నిజామాబాద్ పట్టణంలోను, డిచ్‌పల్లి పోలీస్ క్యాంప్ లోను, తదితర ప్రాంతములలోను సువార్త చేయుచు బలమైన క్రీస్తుసంఘ ములను నిర్మించుచున్నారు. డిచ్‌పల్లి ఆలయ నిర్మాణానికి నిజామాబాద్ క్రీస్తు సంఘ సభ్యులు విశాలహృదయులై విరాళము లిచ్చిరి. ప్రతిష్ట కార్యక్రమములో N.బాబూరావ్, G. రవిబాబు, శ్రీనివాసరావ్, Y.G. ప్రసాదరావ్, రామారావ్ గార్లు తదితర్లు బాధ్యతాయుక్తంగా పాల్గొని జయప్రదం చేసిరి. ప్రతిష్ట అనంతరం 7 గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. వారిలో ప్రథమురాలు సైటస్‌గారి కుమార్తె మేరీ. ఆమె హైదరాబాద్‌లో M.Sc. చదువుచున్నారు. ఆరోజు మధ్యాహ్నంవేళ డిచ్‌పల్లికి 15 కిలోమీటర్ల దూరంలో యున్న సుద్దలం గ్రామంలో క్రీస్తు సంఘ ఆలయానికి Bro. జాషువా గూటం గారు ప్రార్థనపూర్వకంగా శంకుస్థాపన చేసిరి. ఈ గ్రామంలోకూడా సోదరులు సైటస్‌గారు కుటుంబసమేతంగా సువార్త సేవ చేయుచు న్నారు. నిజామాబాద్‌లోను, ఆజిల్లా అంతటిలోను జరుగుచున్న మంచి పనికొరకు ప్రార్థించుదాం.

* * *

జూన్ నెల సువార్తికుల సదస్సు మరియు సువార్త కూటము 22వ తేదీన మామిడికుదురు మండలమందలి మాకనపాలెం గ్రామంలో జరిగెను. ఆయన సంఘముయొక్క క్షేమాభివృద్ధి నిమిత్తమై శ్రమించుచున్న సువార్తికుల సమక్షంలో "వెయ్యేండ్ల పాలన వాక్యానుసారమా?" అను అంశము చర్చింపబడెను.

ఉదయం ప్రారంభమైన సమావేశమునకు సోదరులు పి. జె. కృపాలినిగారు అధ్యక్షులుగా నుండి కార్యక్రమమును క్షేమాభివృద్ధికరంగా నడిపించిరి. సోదరులు పాకా హెన్రీగారు, జె. రెడ్డి స్టీవెన్‌గారు, వి. చిన్నయ్యగారు, డి. శ్రీరాములుగారు, R స్టీవెన్‌సన్‌గారు, బి. యోహానుగారు మరియు టి. పాల్ చైతన్యగారు చర్చలో పాల్గొనిరి. మధ్యాహ్న సమావేశమునకు సోదరులు M కిరణ్ కుమార్ అధ్యక్షత వహించగా సోదరులు S. ఎబినెజరుగారు, పాల్ గూటంగారు, ఇ. కె.వి. ప్రసాదరావుగారు, వై. కొండలరావుగారు మరియు జాషువా గూటంగారు పై అంశముపై చక్కని సంగతులను బోధించిరి.

"బాప్తిస్మమిచ్చు యోహాను పరలోక రాజ్యము సమీపించియున్నదని ప్రకటించెను (మత్త 3:1-2). యేసుప్రభువు రాజ్యమును గూర్చిన సువార్త ప్రకటించెను (మత్త 4:21). క్రీ॥పూ॥ ప్రవక్తలు రాజ్యమునుగూర్చి ప్రకటించిరి (దాని 2:44). క్రీస్తు రెండవ రాకడ తరువాత భూమిమీద ఆయన వెయ్యేండ్లు పాలన చేయునని అపొస్తలులు ఎక్కడ ప్రకటించలేదు. "వెయ్యేండ్ల పాలన" అను అబద్ధ సిద్ధాంతము మానవాభిప్రాయము, మానవ కల్పితము. వీరు అంతము లేని క్రీస్తు రాజ్యమును కించపరచుచున్నారు. "రాజ్యములో పాలివాడను" అని యోహాను, "మనలను... రాజ్యనివాసులనుగా చేసెను" అని పౌలు బోధించుచుండగా (ప్రక 1:9; కొలస్స 1:13), రాజ్యము స్థాపించబడలేదనునది అసత్యము. సంఘము, రాజ్యము వేరుకాదు గాని ఒక్కటే. శిష్యులు జీవించియుండగానే రాజ్యము స్థాపించబడాలి. (మార్కు 9:1) ఫిలిప్పు దేవుని రాజ్యమునుగూర్చి యేసుక్రీస్తు నామమునుగూర్చి సువార్త ప్రకటించగా పురుషులు స్త్రీలు బాప్తిస్మము పొందిరి (అపో.కా. 8:32). రాజ్యమునుగూర్చి యేసుక్రీస్తునుగూర్చి

ము బోధించుచుండెను (అపో.కా. 28:30-31). మత్త 16:18-19లో ంఘము రాజ్యము అని ఒకేసందర్భంలో చెప్పబడింది.

ఆయన రాకడ దినమందు పంచభూతములు లయమైపోవును (II పేతు 3:10). ఆయన భూమిమీద సింహాసనాసీనుడై వెయ్యేండ్లు పాలన చేయుననునది అబద్ధబోధ. ప్రకటన గ్రంథము అలంకారభావంలో వ్రాయబడింది. 1000 అనునది సంపూర్ణతకు గుర్తు. క్రీస్తు రాజ్యము అంతము లేనిది. రాజ్యము మనమధ్యనే యున్నది (లూకా 17:20). ఆయన యిప్పుడు రాజుగా వుండి యాజకుడుగా వుండి రాజ్యపాలన చేయుచున్నాడు. అందుచేత మనమును రాజులైన యాజకులము (1 పేతు 2:9). ప్రక 20 : 1-6 క్రీస్తు విజయమునుగూర్చి సాతాను ఓటమినిగూర్చి, తెలియజేయుచున్నది.

సువార్త దండయాత్ర అనంతరము యిద్దరు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. రాత్రి కూటములో, సోదరులు వడ్డి చిన్నయ్యగారు, పాల్ గూటంగారు దేవుని వర్తమానమును అందించిరి. ఈవర్క్‌షాపుకు విచ్చేసిన వృద్ధులైన సువార్తికులు కూడ యౌవనస్థులతో పాటు సంతోషముతో కాలినడకన జగ్గన్నపేట చేరి తమ గృహాలకు తిరిగి వెళ్ళిరి. మాకవరపాలెంలో సోదరులు కె. ఐజక్ గారు సువార్తసేవ చేయుచున్నారు. జూలై నెలవర్క్‌షాప్ 26వ తేదీ మంగళవారం జగన్నాథగిరిలో Bro. P. ప్రకాశంగారి ఆధ్వర్యమున జరుగును. ★

---

Regd. No. H/KD-45/KD H.O

From
SATYAVAKKU
P.O. Box 80
KAKINADA 533 001

No.

To

5690/ 57/0S
CHURCH OF CHRIST
P.O. BOX NO. 3815
NEW DELHI
110047

